# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-03-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. బహుళ రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మారిషస్ దేశ ప్రధానమంత్రితో చర్చలు జరిపారు.**

**2. మహిళల భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ "శక్తి " యాప్ ను రూపొందించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**3. తెలంగాణలో 6 వేల కోట్ల రూపాయలతో స్వయం ఉపాధి పథకాలను అమలు చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.**

**4. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 40 వేల కోట్ల రూపాయల పనులకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపిందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ పేర్కొన్నారు.**

**5. తెలంగాణా రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభమవుతున్నాయి.**

=========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మారిషస్ పర్యటనలో భాగంగా పోర్ట్ లూయిస్‌లో ఆ దేశ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులంతో సమావేశమయ్యారు. బహుళ రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఇద్దరు నాయకులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా బహుళ రంగాలలో పరస్పర సహకారం పెంపునకు భారత్, మారిషస్ దేశాలు తీర్మానించాయి. కాగా అంతకుముందు ఆ దేశాధ్యక్షులు ధరమ్ గోకుల్ తో సమావేశమైయ్యారు. అనంతరం ఆ దేశ జాతిపిత సీవోసాగర్ రామూలం పేరుతో ఏర్పాటైన వృక్ష సంరక్షణ కేంద్రాన్ని సందర్శించి మొక్కను నాటారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో నవీన్‌చంద్ర కూడా పాలుపంచుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కాగా మారిషస్ తమ దేశపు అత్యున్నత పౌర పురస్కారాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కి ప్రకటించింది. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయుడిగా నరేంద్రమోదీ నిలిచారు.

-------------------------

మహిళల భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ "శక్తి " యాప్ ను రూపొందించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా హోం శాఖ పద్దులపై జరిగిన చర్చలో నిన్న శాసనసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రతీ మహిళా తమ ఫోన్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

డ్రోన్ల ద్వారా రాత్రి పెట్రోలింగ్ ప్రారంభిస్తామని చంద్రబాబు నాయుడు తెలియజేస్తూ,

వాయిస్ .. 27 ..సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునఃప్రారంభిస్తారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలో ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయం విస్తరణ పనులకు ముఖ్యమంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, లక్ష కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చేలా అమరావతి నిర్మాణం ఉంటుందని చెప్పారు. రాజధాని పనులను వచ్చే నెలలో తిరిగి ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..18.. సెకన్లు

---------------------------

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు 6 వేల కోట్ల రూపాయలతో స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజీవ్ యువ వికాస్ పేరుతో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా యువతకు స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపడుతున్నామని భట్టి విక్రమార్క తెలియజేస్తూ,

వాయిస్ .. 29 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా ఈరోజు జరిగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్-పేపర్ 2, ఎకనామిక్స్ పేపర్-2 పరీక్షలకు సెట్ నెంబరు 3 ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు కొద్దిసేపటి క్రితం వెల్లడించింది.

కాగా.. తెలంగాణాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం గణితం పేపర్-2ఎ, బోటనీ-పేపర్ 2, పొలిటికల్ సైన్స్-పేపర్ 2 పరీక్షలు జరుగుతాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 40వేల కోట్ల రూపాయల పనులకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ -సీఆర్‌డీఏ ఆమోదం తెలిపిందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిన్న సీఆర్డీఏ 45వ సమావేశం జరిగింది. అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ, దాదాపు 70 పనులకు సంబంధించిన నిర్మాణ పనులకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపిందన్నారు. కాంట్రాక్టు ఏజెన్సీలతో ఒప్పందాలు పూర్తయిన తర్వాత రాజధానిలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని మంత్రి తెలుపుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

తెలంగాణా రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. సమావేశాల్లో భాగంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం సభ వాయిదా పడనుంది. తర్వాత శాసన సభ వ్యవహారాల కమిటి బిఏసి సమావేశంలో సభను ఎన్నిరోజులు నిర్వహించాలనేది నిర్ణయించనున్నారు.

---------------------------

ఉప్పు తయారీపై బ్రిటీష్ ప్రభుత్వం పన్ను విధించటాన్ని నిరసిస్తూ జాతిపిత మహాత్మాగాంధీ చేపట్టిన ఉప్పు సత్యాగ్రహానికి ఈ రోజుతో 95 ఏళ్ళు పూర్తయ్యాయి. ఉప్పు సత్యాగ్రహాన్ని దండి మార్చ్‌గా కూడా పిలుస్తారు. 1930 మార్చి 12న గుజరాత్ రాష్ట్రంలోని సబర్మతీ ఆశ్రమం నుండి అహ్మదాబాద్‌లోని దండీ గ్రామం వరకు 24 రోజుల పాటు ఈ ఉప్పు సత్యాగ్రహ ర్యాలీ సాగింది. 80 మందితో ప్రారంభమైన దండి మార్చ్‌లో ముగింపు సమయానికి 5 వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు.

---------------------------

భారత్‌ను అంతర్జాతీయ వినోద రంగానికి కేంద్రంగా మార్చేందుకు, వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్ టెయిన్ మెంట్–వేవ్స్ 2025 సదస్సును ముంబైలోని జియో వరల్డ్ గార్డెన్స్‌లో మే 1 నుంచి 4వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. దేశంలో మీడియా–వినోదరంగం అభివృద్ధి, వాణిజ్యపరమైన అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది.

..ప్రోమో...

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, తూర్పు ఆగ్నేయ, ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పొడి వాతావరణం కొనసాగుతుందని తెలిపింది. సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలుపుతూ,

వాయిస్ ... 25 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================